**కథ**

# పునాది

'మేరేజ్ ఈజ్ ఏన్ ఎడ్జెస్ట్‌మెంట్' అని అనుభవజ్ఞులైన పెద్దలు చెప్పిన సూక్తి మాకు కూడా వర్తిస్తుంది. ఒకరి ఇష్టాలను మరొకరి ఇష్టాలుగా మార్చుకునే సగటు దంపతులలాగే వేము అడ్జెస్టయిపోతూ జీవిస్తున్నాం. నేను అభిషేక్ దంపతులమై ఏడాది కావస్తోంది. ఆ సహజీవనంలోని సాన్నిహిత్యంలో అతనిలో నేను ఊహించని బలహీనత బయటపడింది. ఆ బలహీనత 'విరజ'. అతనికిష్టమని హార్రర్ సినిమాలు చూడడానికి అలవాటు పడిన నేను అతనికిష్టం లేదని నాకెంతో ఇష్టమైన కొత్తిమీరని సునాయాసంగా త్యాగం చెయ్యగలిగిన నేను విరజ విషయంలో మాత్రం రాజీపడలేకపోయాను

అతని బట్టల బీర్వా సర్దుతుంటే బట్టల క్రింద నుంచి బయటపడ్డాయి విరజ వ్రాసిన ఆ ఉత్తరాలు. ఇతరుల ఉత్తరాలను చదవడం సభ్యత కాదని తెలిసినా అభిషేక్‌కి ఒక అమ్మాయి వ్రాసిన ఉత్తరాలను క్యూరియాసిటీ నన్ను చదివేలా చేసింది.

''మన పెళ్ళికి నా కులం అడ్డుగోడగా నిలుస్తుందనుకోలేదు. నువ్వెంతో ఆదర్శభావాలుగల వ్యక్తివనుకున్నాను. కాని, ఇంత సంకుచితంగా ఆలోచించగలవని ఎప్పుడూ అనుకోలేదు. నీకు నీ తల్లిదండ్రులే ముఖ్యం. కన్నవాళ్ళ కోసం నన్ను నా ప్రేమని మరచిపోయావు'' ఆ ఉత్తరాన్ని చదవగానే నా కాళ్ళ క్రింద భూమి కంపించినట్టయింది.

అభిషేక్ నాతో పెళ్ళికి ముందే విరజని ప్రేమించాడన్నమాట! స్త్రీ సహజమైన అసూయతో నా మనసు భగ్గుమంటోంది. ఏదో తెలియని ఆవేశంతో ఉద్రేకంతో నా శరీరం కంపించిపోతుంటే రెండవ ఉత్తరాన్ని తెరిచాను.

''నువ్వు నాకేమీ కావని తెలిశాక కూడా నీపై ఇష్టాన్ని ప్రేమని చంపుకోలేని బలహీనురాలిని. అందుకే ఈ జన్మకి పెళ్ళిమాట తలపెట్టదలచుకోలేదు. నీ జ్ఞాపకాలలో జీవిస్తూ, మరో జన్మలోనైనా నీదాన్నికావాలని కోరుకుంటున్న నీ-విరజ.

నా పళ్ళు ఆవేశంతో కరకరలాడసాగాయి. అభిషేక్ నాపై ఇన్నాళ్ళూ కనబరిచిన ప్రేమ అంతా నటన అన్పిస్తోంది. ఎంత దగా! ఎంత వంచన! విరజని ప్రేమించి నన్ను పెళ్ళి చేసుకున్న ఈ వ్యక్తి అతని జీవితంలో నేనే మొదటి స్త్రీనయినట్టు ఎంత గొప్పగా నటిస్తున్నాడు!

నాలో ఆవేశం, అసూయ క్షణక్షణానికి బి.పిలా రెయిజయిపోతున్నాయి. ఆ సాయంకాలం అతను ఆఫీసు నుంచి వచ్చేటప్పటికి నేను యుద్ధానికి సన్నద్ధురాలయిన సైనికురాలిలా వరండాలోనే కూర్చుని వున్నాను.

అతని ముఖంలో అదే ప్రశాంతత!

పెదవులపై చిరునవ్వు. నా మనసు ఉడికిపోతుంటే సూటిగా అడిగాను.

''విరజ ఎవరు?''

నా నుంచి విరజ ప్రస్తావనను అతనూహించలేదేమో, క్షణకాలం అతని ముఖంలో గబగబ రంగులు మారిపోయాయి.

''ఏమిటంత కోపంగా వున్నావు'' చిరునవ్వుతో అడిగేడు.

''విరజ ఎవరు?'' అతన్ని వాడిగా చూస్తూ తిరిగి అదే ప్రశ్న రిపీట్ చేశాను.

అతని ముఖం గంభీరమయింది. అతని సమాధానం కోసం ఆశించకుండా మళ్ళీ అడిగేను.

''మీరు విరజని ప్రేమించారు. ఆమెని పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. అవునా?''

''అవును'' అతని స్వరంలో ఎలాంటి తొట్రుపాటు లేదు. నిజాయితీగా ధ్వనించింది.

''ఆమెని నేను-ఇష్టపడిన మాట నిజమే. పెళ్లి చేసుకోవాలనుకోడం కూడా నిజమే. కాని, మా కులాలు వేరని మా అమ్మా నాన్నలు మా పెళ్ళికి అభ్యంతర పెట్టారు. ఇంతకీ విరజ విషయం నీకెలా తెలుసు?''

''ఇదుగో! మీ ప్రియురాలు మీకు వ్రాసిన ప్రేమలేఖలు ఆ విషయాన్ని నాకు తెలియచేశాయి'' వ్యంగ్యంగా అంటూ చేతిలోని ఉత్తరాలను అతని ముందుకి విసిరాను. అతని ముఖం క్షణకాలం ఎర్రబడింది.

''ఇవా! ఈ ఉత్తరాలను అప్పుడే చింపెయ్యవలసింది'', అంటూ ఆ ఉత్తరాలను అందుకుని చింపి ముక్కలు చేసి చెత్తబుట్టలోకి నిర్లక్ష్యంగా విసిరేశాడు.

''మీ జీవితంలోని మధుర స్మృతులు అవి వాటిని ఎందుకు చింపేశారు?'' వ్యంగ్యంగా నవ్వుతూ అన్నాను.

''నా జీవితమనే పుస్తకంలో నుంచి 'విరజ' అనే పేజీనే చింపేశాను. ఆమె వ్రాసిన ఉత్తరాలను చింపెయ్యడం నాకేం బాధ కలిగించడం లేదులే!''

కాని, అభిషేక్ విరజని మరచిపోలేదని నా నమ్మకం. అతను అప్పుడప్పుడు పరధ్యానంగా వుంటాడు. ఎంత పరధ్యానంగా అంటే పక్కనే నిలబడి నాలుగుసార్లు బిగ్గరగా పిలిచినా విన్పించుకోనంత పరధ్యానంగా. ప్రభుత్వరంగ సంస్థలో బాధ్యతాయుతమైన ఉద్యోగి అయిన అతను ఇంటికి వచ్చినా ఆఫీసు వ్యవహారాలలో తలమునకలయి ఆలోచిస్తూ వుంటాడని అందుకే అలా పరధ్యానంగా వుంటాడని గతంలో సరిపెట్టుకునేదాన్ని.

విరజ విషయం తెలిశాక, అతను అనుక్షణం విరజ గురించే ఆలోచిస్తూ పరధ్యానంగా వుంటాడనే ఊహకే నా మనశ్శరీరాలు భగ్గుమనేవి.

''మీ ప్రేమ ఏ దశలో ఆగిపోయింది?'' ఒక రోజు అడిగానతన్ని.

''అంటే?'' అర్థం కానట్టు చూస్తూ అడిగేడు.

''అదే...విరజని ప్రేమించి వూరుకున్నారా? లేక...'' అర్ధోక్తిలో ఆగిపోయాను.

అభిషేక్ దెబ్బ తిన్నట్టు నా వైపు చూశాడు.

''ఎన్నోసార్లు ఆమెతో ఏకాంతంగా వున్నప్పటికీ మేము హద్దులు దాటలేదు. నేనే కాదు విరజ కూడా నైతిక విలువలకి ప్రాధాన్యమిచ్చే మనిషి.''

అభిషేక్ ఎంత సంస్కారవంతుడో నాకూ తెలుసు. మా పెళ్ళయిన తరువాత వారం దాకా శోభన ముహూర్తానికి వీలవలేదు. ఆ వారం రోజులలో అతనితో ఎన్నోసార్లు ఏకాంతంగా వున్నాను. అతను కనీసం నా చేతిని తాకే ప్రయత్నం కూడా చెయ్యలేదు. కాని, అతను విరజతో ఏకాంతంలో హద్దులు దాటలేదంటే నాకు నమ్మబుద్ధికావడం లేదు.

నా మనసులో అసూయ, అశాంతి రోజు రోజుకీ వట వృక్షంలా పెరిగిపోతున్నాయి. నాకు హఠాత్తుగా సుధీర్ గుర్తుకొచ్చాడు.

సుధీర్ నా మేనమామ కొడుకు. నా పట్ల వున్న ఆరాధన అతని కళ్ళల్లో, మాటల్లో వ్యక్తమవుతూ వుండేది. అతనిపై నాకు ఇష్టమూ లేదు. అయిష్టమూ లేదు. కాని అతను నా చిరునవ్వు కోసం, కనుచూపుకోసం తహతహలాడుతుండడం నాకు థ్రిల్లింగ్‌గా వుండేది. ఒక రోజు అతను వివాహ ప్రస్తావన తెచ్చాడు. నేను అతనికేం సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తుండగానే అభిషేక్ సంబంధం నన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఆస్తిలో అందంలో హోదాలో సుధీర్ కంటే ఉన్నతుడైన అభిషేక్ సంబంధం నన్ను వెదుక్కుంటూ వస్తే కాదనడానికి నేను వెర్రిదాన్నేమీ కాదు. రాజకుమారుడులాంటి అభిషేక్ నన్ను పెళ్ళి చేసుకోడానికి ముందుకొచ్చేసరికి నాలోని అహం రెట్టింపయింది.



కాని, ఇప్పుడు అభిషేక్ జీవితంలో మరో అమ్మాయి వుందని తెలియ నే నా అహం గాయప డింది. అతను భర్తగా నాక ద్రోహం చెయ్యకపోనీ, అది వేరే సంగతి. కాని, ( తను నాకంటే ముందు మరో అమ్మాయిని ప్రేమించ ు. అది నా మనసులో ముళ్ళు గుచ్చినట్టుంది. నేనొక ివి నుంచి దిగి వచ్చిన దేవతనన్నట్టు ఆరాధనగా చూ , సుధీర్ గుర్తురావడం

యాదృచ్ఛికమే అయినా, ఆ సమయంలో అతను గుర్తురావడం నాకు తెలియని పూరటని కలిగించడంతో బాటు అభిషేక్ సంస్కారాన్ని పరీక్షించడానికి నాలో ఒక వ్యూహం రూపు దిద్దుకునేలా చేసింది. తను విరజని ప్రేమించిన విషయాన్ని దాచిపెట్టి, నేను ఆ విషయం అడగ్గానే నిజాయితీగా అంగీకరించిన అతను నా ప్రేమకథని విని ఎలా రియాక్టవుతాడు?

నేను ఆ రాత్రి అభిషేక్ చేతుల మధ్య ఒదిగిపోయి, అ ను నా మెడవంపులో విశ్రాంతి తీసుకుంటూండగా

**హోతా పద్మినీదేవి**

అన్నాను.

''మీరు నన్ను క్షమించాలి''

''దేనికి?''

నేను ఒక్క క్షణం మాట్లాడలేదు. ''దేనికి?'' అతను రెట్టించాడు.

''నేను సుధీర్‌తో నా ప్రేమ విషయాన్ని మీకు చెప్పకుండా దాచినందుకు.''

నేను ఊహించినట్టుగా నన్నల్లుకున్న అతని చేతులు వదులవలేదు.

''సుధీర్ ఎవరు?'' ఆ స్వరంలో అసూయకాని, అనుమానం కాని మచ్చుకైనా కన్పించలేదు.

''సుధీర్ నా మేనమామ కొడుకు. అతనికి నేనంటే ప్రాణం. నాకతనే సర్వస్వం. మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. కాని, మా నాన్నగారికి అతనికి నన్నిచ్చి పెళ్ళి చేసే ఉద్దేశం లేదు. నేను ఇంట్లో వాళ్ళని ఎదిరించి అతన్నే పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. ఈలోగా మీ సంబంధం వచ్చింది. ఆస్తిలో, హోదాలో అందంలో సుధీర్‌కంటే ఉన్నతులైన మీవైపే మా నాన్నగారు మొగ్గు చూపారు. ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా సుధీర్‌ని పెళ్ళి చేసుకుని సుఖపడలేనన్పించింది. తప్పనిసరి పరిస్థితులతో మీతో పెళ్ళికి తల వంచాను''

అతని ముఖంలోని భావాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ స్వరంలో బాధని ఎరువుతెచ్చుకుని చెప్పాను.

అతని ముఖంలో మార్పులేదు.

''యువతీ యువకుల మధ్య ఆకర్షణ సహజం. దానికి ప్రేమ అని పేరు పెట్టుకుని మనని మనం వంచించుకుంటాం. నిజంగా మనం అవతలి వ్యక్తిని నిజాయితీగా ప్రేమిస్తే ఆ వ్యక్తిని మరచిపోయి వేరొకరిని జీవితంలోకి ఆహ్వానించలేము. అలా మరచిపోతే అది ప్రేమే

కాదు. ప్రేమ అంటే నాకోసం నువ్వు-నీకోసం నేను అనే భావన. ఆ ప్రేమ మనం బ్రతికి వున్నన్నాళ్ళు సజీవంగా మన మనసులో వుండాలి'' అతని మాటలు ఆవేశంగా లేవు, ఆలోచనాత్మకంగా వున్నాయి.

''కాని, నేను సుధీర్‌ని మరచిపోలేకపోతున్నాను'' ముఖంలో బాధని ప్రతిఫలింపజేస్తూ అన్నాను.

''అతన్ని నువ్వు మరచిపోలేకపోతునన్నావంటే నాలో ఏదో లోపం వుండి వుండాలి'' అతని స్వరంలో ఆవేదన. ''మన దాంపత్యం ఎప్పటికీ ఫ్రెష్‌గా వుండాలంటే ఏం చెయ్యాలో చెప్పు'' అతని స్వరం నిస్సహాయంగా వుంది.

నేను అతని స్వరంలో ధ్వనిస్తున్న నిజాయితీ నటనా, నిజమా అని తెలుసుకోవడానికి రెప్పవాల్చకుండా అతన్నే చూస్తున్నాను.

అభిషేక్ మంచం మీద నుంచి లేచి గదంతా పచార్లు మొదలుపెట్టాడు. అతనిలోని అలజడిని గమనిస్తున్న నాలోని శాడిస్ట్ ఒక్కసారిగా నిద్రలేచింది.

''సుధీర్‌తో నా ప్రేమ విషయం తెలిశాక కూడా మీకు అసూయకాని, కోపం కాని లేవా?''

''లేవు'' నిజాయితీగా చెప్పాడతను.

''అది మీ విశాల హృదయానికి నిదర్శనం అని మీరనుకుంటున్నారేమో! కాని, నేనేమనుకుంటున్నానో తెలుసా? మీ జీవితంలో 'విరజ' అనే బలహీనత వుంది. అందుకే నా బలహీనతని క్షమించగలుగుతున్నారు. దాంపత్యం అంటే ఒకరి ఇష్టాలను మరొకరి ఇష్టాలుగా మార్చుకోడం మాత్రమే కాదు. ఒకరి బలహీనతలని మరొకరు క్షమించుకోడం కూడా కదా?'' అన్నాను.

అతను పాలిపోయిన ముఖంతో నావైపు చూస్తూ నిలబడిపోయాడు.

''గుడ్‌నైట్'' నవ్వి నేను దుప్పటి కప్పుకున్నాను. అతను ఆ రాత్రంతా మేల్కొనే వున్నాడని నాకు తెలియదు.

★★★

రెండు రోజుల తరువాత..

మధ్యాహ్నం రెండు గంటలకి కాలింగ్ బెల్ మోగితే వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా సుధీర్!

''హలో!'' అన్నాడు చిరునవ్వుతో.

''హలో!'' ప్రతిగా నేనూ నవ్వాను. ''ఏమి టింత హఠాత్తుగా వూడిపడ్డావ్?''

''నేను వచ్చి నాలుగురోజులయింది. ఆఫీసు పని మీద వచ్చానిక్కడికి''

''లోపలికి రా!'' అన్నాను పక్కకి తప్పుకుని దారి యిస్తూ. అతను లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. అతను అణువణువునా ఐశ్వర్యం తాండవిస్తున్న నా ఇంటిని పరిశీలనగా చూడడం గమనించిన నా పెదవులపై గర్వరేఖ తొణికిసలాడింది.

కాఫీ ట్రేతో నేను తిరిగి డ్రాయింగ్ రూంలోకి వచ్చేసరికి అతను ఎదురుగా రోజ్‌వుడ్ కార్నర్ స్టాండ్ మీదున్న అభిషేక్ ఫొటోని చూస్తున్నాడు. నేనతని కళ్ళలోని ఈర్ష్యని గమనించకపోలేదు.

''చెప్పు. ఏమిటి విశేషాలు?'' అడిగేను అతనికెదురుగా కూర్చుంటూ.

''నువ్వే చెప్పు. ఎలా వుంది జీవితం?'' నన్ను ఆరాగా పట్టి పట్టి చూస్తూ అడిగేడు. ఆ ప్రశ్న అతనెందుకు అడిగాడో నాకు బాగా తెలుసు. అభిషేక్ లాంటి స్థితిపరుడు నన్ను కోరి కట్నకానుకలకి ఆశించకుండా పెళ్ళి చేసుకోవడం మా బంధువర్గంలో ఎన్నో అనుమానాలని రేకెత్తించింది.

''ఏదో లొసుగు వుంది. లేకపోతే అంత డబ్బున్నవాడు అందం తప్ప ఏ ప్రత్యేకతా లేని శిల్పని ఎందుకు పెళ్ళి చేసుకుంటాడు?'' అని పెళ్ళి పందిరిలోనే కొంతమంది నాకు వినిపించేటంత గట్టిగా చెప్పుకోవడం నాకు తెలుసు.

ఇప్పుడు సుధీర్ నన్ను ఆ ప్రశ్న అడగడంలోని అంతరార్థమూ అదే. నేనా ప్రశ్నకి సమాధానం చెప్పేలోగా తిరిగి అతనే ప్రశ్నించాడు.

''మీ ఆయన మంచివాడేనా?''

''చాలా మంచివారు''

నా జవాబుతో అతని ముఖం కొద్దిగా వాడిపోయింది.

''మామయ్య ఎలా వున్నాడు? ఈ సంవత్సరమైనా నీ పెళ్ళి వార్త వినిపిస్తావా?'' కావాలనే అతని పెళ్ళి ప్రస్తావన తెచ్చాను.

సుధీర్ ముఖం గంభీరమయింది.

''చాలా సంబంధాలే వస్తున్నాయి. కాని, నేను కోరుకున్న లక్షణాలు మాత్రం ఏ అమ్మాయిలోనూ లేవు. అందుకే నేనింత వరకు పెళ్ళి చేసుకోలేకపోయాను.''

''ఏమిటబ్బా నువ్వు కోరుకుంటున్న ఆ ప్రత్యేక లక్షణాలు?

''చెప్పనా?'' అతను రెప్పవాల్చకుండా నన్ను చూస్తూ అన్నాడు. ''నీలా వుండాలి''

నాలోని అహం సంతృప్తి చెందింది. ''అచ్చంగా నాలాగే వుండే అమ్మాయి దొరకడం అసంభవమేమో?''

''నీకంటే అందమైన అమ్మాయి దొరకడం కూడా అసంభవమే. అందుకే ఈ జన్మలో పెళ్ళి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను.''

నా అహం మరింత గర్వపడింది.

'నా కోసం పడి చచ్చే సుధీర్ నన్ను పెళ్ళి చేసుకోలేకపోయినందుకు ఈ జన్మలో పెళ్ళే చేసుకోనంటున్నాడు.'

''నేను వెళ్తాను'' కొద్దిసేపటి తరువాత అతను లేచాడు.

''అదేమిటి, భోజనానికి వుండవా?''

''మీ ఆయన ఏమైనా అనుకుంటారేమో?''

''ఏమీ అనుకోరు. అయినా నీ గురించి ఆయనకి అంతా తెలుసు.''

''అంతా తెలుసా? ఎలా?'' విస్మయంగా అడిగేడు.

''నేనే చెప్పాను.''

''నా గురించా? ఏమని?''

''నువ్వు నన్ను ప్రేమించిన విషయం''

''ఎంత పని చేశావు? నేను ఆయనకెప్పుడైనా ఎదురుపడితే? ఆయన ముందు నేను తలెత్తుకోలేకుండా చేసేశావు''

''ఆయన చాలా సంస్కారవంతులు'' అంటూ అభిషేక్ గురించి మరింత ఉన్నతంగా చెప్పాను.

'అదృష్టవంతురాలివి' అన్నాడు సుధీర్. అతని స్వరంలో ధ్వనించిన ఈర్ష్య నాకెంతో సంతృప్తినిచ్చింది.


''కాబట్టి మా ఆయన ఏదో అనుకుంటారని భయపడనవసరం లేదు నిరభ్యంతరంగా మా ఇంటికి నువ్వెప్పుడైనా రావచ్చు''

సుధీర్ ఆ రోజు చాలాసేపు మా ఇంట్లో వున్నాడు. అతను వెళ్ళిన గంట తరువాత అభిషేక్ ఇంటికి వచ్చాడు.

''ఇవాళ మన ఇంటికెవరు వచ్చారో చెప్పుకోండి'' వూరిస్తున్నట్టు అడిగేను.

''గెస్ చేసే ఓపిక నాకు లేదు కాని, మన ఇంటికి వచ్చిన ఆ వ్యక్తి నీకెంతో ఇష్టమైన వ్యక్తి అని మాత్రం చెప్పగలను. ఆ విషయం నీ ముఖమే చెబుతోంది'' అన్నాడతను.

''కరెక్ట్. నాకిష్టమైన వాళ్ళే ఇంటికి వచ్చారు. వచ్చినదెవరో చెప్పేస్తాను... సుధీర్!''




''నిజమా?'' సంభ్రమంగా చూశాడతను. ''నేను వచ్చేవరకు వుండమనలేకపోయావా? మనం కలిసి ఎక్కడికైనా వెళ్ళేవాళ్ళం కదా!'' చాలా కాలం నుంచి రాకపోకలు సాగిస్తున్న స్నేహితుడెవరో ఆ ఇంటికి వచ్చివెళ్ళినంత మామూలుగా అన్నాడతను.

''వుండమనే అన్నాను. పని వుందని వెళ్ళిపోయాడు. మళ్ళీ వస్తానన్నాడు'' అన్నాను.

సుధీర్‌తో నా (అబద్ధపు) ప్రేమకథ తెలిసీ మా ఇంటికి అతను వచ్చి వెళ్ళాడని

తెలిశాక కూడా మామూలుగానే ప్రవర్తిస్తున్న అతని సంస్కారం నిజమా, నటనా?

ఆ రాత్రి అడిగేను–

''సుధీర్ మీరు ఇంట్లో లేనప్పుడు మన ఇంటికి వచ్చాడు. దాదాపు మూడు గంటలసేపు మేమిద్దరం ఏకాంతంగా గడిపాము. మా మధ్య ఏం జరిగిందోనని మీకు అనుమానంగా లేదా?''

అతను నవ్వేడు. ''నీ మొహం! జరగడానికేం వుంది?''

''ఏమైనా జరగవచ్చు. ఎందుకంటే అతను కేవలం నా 'బావ' మాత్రమే కాదు. ఒకప్పుడు మేము ప్రేమించుకున్నాం కూడా''

''పెళ్ళికి పునాది నమ్మకం. ఆ పునాదే లేని నాడు దాంపత్యం అనే భవనం కుప్పకూలిపోతుంది. తను ఆఫీసులో వుండగా భార్య ఎవరితోనో తిరుగుతోందని భర్త, భర్త కేంపులకి వెళ్ళే వంకతో హోటల్స్‌లో కాల్ గర్ల్స్‌తో గడుపుతున్నాడని భార్య అనుమానిస్తూ వుంటే ఆ సంసారం నరకప్రాయమవుతుంది. ఆ దాంపత్యం విచ్ఛిన్నమై విడాకుల దాకా వెళ్ళుతుంది. నాకు నీపై ఎలాంటి అనుమానం లేదు. నేను నిన్ను అనుమానిస్తున్నానేమో అనే నీ అనుమానాన్ని సమాధి చెయ్యి'' అన్నాడు అభిషేక్.

అతని మహోన్నతమైన సంస్కారం ముందు నేను మరుగుజ్జునయిపోయాను.

★★★

సుధీర్ మా ఇంటికి నాలుగైదుసార్లు వచ్చాడు. అతను మంచి మాటకారి. మంచి గాయకుడు కూడా. అతనితో కబుర్లతో గంటలు క్షణాల్లా గడిచిపోయేవి. అతను పాడుతుంటే మైమరచి వినేదాన్ని.

అభిషేక్ ఆఫీసు పని మీద బొంబాయి వెళ్ళి అప్పటికి వారం రోజులు. ఆరోజు అతను వస్తాడని అతనికిష్టమైనవన్నీ వండి, అతనికిష్టమైన లెమన్ ఎల్లో షిఫాన్ చీరలో అలంకరించుకుని అతనికోసం ఎదురుచూస్తున్నాను. ఇంతలో కాలింగ్ బెల్ మోగింది.

ఆ శబ్దం కోసమే ఒళ్ళంతా చెవులు చేసుకుని ఎదురుచూస్తున్న నేను వెంటనే వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా సుధీర్!

నేను ఎంతగానో ఎదురుచూస్తున్న అభిషేక్ కాకుండా అనూహ్యంగా సుధీర్ అక్కడ ప్రత్యక్షమవడంతో కొంచెం అసంతృప్తిగానే అనిపించినా, తేరుకుని నవ్వుతూ ఆహ్వానించాను. అతను లోపలికి వచ్చాడు.

''ఇవాళ ఆదివారమేగా? మీ ఆయన ఇంట్లో లేరా?'' అడిగేడు.

''ఆఫీసు పని మీద బొంబయి వెళ్ళారు. ఇవాళ వస్తారు'' అన్నాను.

నాకెదురుగా సుధీర్ మౌనంగా కూర్చున్నాడు. ఇవాళ ఎందుకో అతను కొత్తగా కనిపిస్తున్నాడు. తలవంచుకుని, సీరియస్‌గా నేలని చూస్తూ మధ్యలో తలెత్తి నన్ను తదేకంగా చూస్తున్నాడు. అతని చూపులలోని ఆరాధన నాకు కొత్తకాదు. కాని, ఇవాళ ఆరాధనకి బదులు ఆకలి స్పష్టంగా కనిపిస్తూ నా ఒళ్ళు జుగుప్సతో ముడుచుకుపోయేలా చేస్తోంది.

''అభిషేక్ త్వరగా వస్తే బాగుండును'' అనుకున్నాను. నాకు అతని మౌనం భరింపరానిదిగా వుంది. స్టేషన్‌కి ఫోన్ చేశాను. ట్రెయిన్ గంట లేటుట. నా మనసు నిరాశగా మూలిగింది. సుధీర్‌కెదురుగా కూర్చోవాలని లేదు. ఏదో పని కల్పించుకుని బెడ్‌రూమ్‌లోకి వచ్చి నీట్‌గా వున్న గదినే మళ్ళీ సర్దడం మొదలుపెట్టాను. నా వెనుక ఎవరో నిలబడిన అలికిడయింది. గిరుక్కున వెనుదిరిగి చూసాను.

సుధీర్! అతను మా ఇంటికి నాలుగైదుసార్లు వచ్చినా ఎప్పుడూ డ్రాయింగ్‌రూమ్ దాటి లోపలికి వచ్చింది లేదు. అలాంటిది ఇప్పుడు సరాసరి బెడ్‌రూమ్‌లోకి వచ్చిన అతన్ని చూసి చకితురాలినయ్యాను.

''నువ్వు కాస్సేపు రెస్ట్ తీసుకోవాలనుకుంటే గెస్ట్‌రూమ్‌లో పడుకో!'' అన్నాను. అన్యాపదేశంగా అతన్ని అక్కడనుంచి వెళ్ళిపోమని చెబుతూ.

జవాబుగా అతను నాకు అతి సమీపంలోకి వచ్చి ఒక్క ఉదుటున నన్ను బలంగా కౌగలించుకున్నాడు.

ఊహించని ఈ హఠాత్పరిణామానికి నిశ్చేష్టురాలినైన నేను మరుక్షణం తేరుకుని ''సుధీర్! ఏమిటిది, విమలు!'' అన్నాను పెనుగులాడుతూ.

''ప్లీజ్ కాదనకు ఒక్కసారి నా కోరిక తీర్చు'' అతను ఉడుంపట్టు నన్ను అల్లుకుపోతున్నాడు. [illegible]

''నా ఆశలని, కలలని సమూలంగా నాశనం చేసి మరొకరిని పెళ్ళి చేసుకున్నావు. ఒక్కసారి నా కోరిక తీర్చు. మళ్ళీ ఈ జన్మలో నీకు కనిపించను.''

''వదులు. ఆయన వచ్చే టైమయింది. నా కాపురాన్ని నాశనం చెయ్యకు'' నాకు ఏడుపు వస్తోంది.

అతను నా మొరని వినడం లేదు. మరింత బలంగా అల్లుకు పోతున్నాడు.

కాలింగ్ బెల్ మోగింది.

''అదుగో, ఆయన వచ్చినట్టున్నారు. నన్ను వదులు'' ప్రాధేయపడుతూ అన్నాను.

''రానియ్యి. ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్న అవకాశాన్ని వదులు కునేంత మూర్ఖుడిని కాను'' అతను నా చీర కుచ్చెళ్ళని పట్టి బలంగా గుంజాడు. మరుక్షణం నా చీర వూడి అతని చేతులలోకి వచ్చేసింది. నేను అతని భుజాన్ని కండవూడి వచ్చేలా కొరికాను.

''అబ్బా!'' అతను బాధతో విలవిలలాడుతూ ఒక నిముషం పట్టు సడలించాడు. అది అవకాశంగా తీసుకుని నేను డ్రాయింగ్‌రూమ్‌లోకి పరిగెట్టాను. నా ఒంటిమీద కేవలం లంగా, జాకెట్టు మాత్రమే వున్నాయని స్పృహే లేదు నాకు. ఇంటికి వచ్చినదెవరో కూడా తెలియదు. నిలువెల్లా కంపిస్తూ తలుపు బోల్ట్ తీశాను.

ఎదురుగా అభిషేక్!

''ఏమండీ! నేను..నన్ను..సుధీర్'' అస్పష్టంగా అంటూ కళ్ళముందు చీకటి వలయాలు కన్పిస్తుండగా అక్కడే కుప్పకూలిపోయాను. పడిపోతున్న నన్ను అతను పొదివి పట్టుకోడం మాత్రం తెలుసు నాకు.

★★★

తిరిగి నాకు స్పృహ వచ్చేటప్పటికి నేను అభిషేక్ ఒడిలో వున్నాను. అతను ఆతృతగా నా ముఖంలోకి చూస్తున్నాడు. అసలేం జరిగిందో కూడా అర్థంకాని అయోమయస్థితిలో కొన్ని క్షణాలు వెర్రిగా అతన్ని కప్పగించి చూస్తూండిపోయాను.

క్రమంగా జరిగినదంతా గుర్తు వచ్చింది. అప్పుడు వచ్చింది నాకు దుఃఖం.

''ఊరుకో శిల్పా'' అతను నా తల నిమురుతూ ఓదార్చసాగాడు. అతను ఓదార్చే కొద్దీ నా దుఃఖం ఎక్కువయింది.

''నీ ఇష్టంతో ప్రమేయం లేకుండా జరిగిన దానికి నువ్వెలా బాధ్యురాలివవుతావు. శిల్పా! ఇంత చిన్న విషయానికి నువ్వింత అప్‌సెట్ అవాలా?'' అంటూ అతను విశ్వరూప సందర్శనం ఇస్తున్న శ్రీకృష్ణునిలా కనిపించాడు. ఇతనినా నేను పరీక్షించాలనుకున్నాను! నా అవివేకానికి నాకే సిగ్గేసింది.

''నన్ను నమ్మండి. నేను అపవిత్రమవలేదు'' అంటూ జరిగినదంతా చెప్పాను.

''నాకు తెలుసు.'' అన్నాడతను చిరునవ్వుతో.

''మీకు ఒక అబద్ధం చెప్పాను'' సిగ్గు, పశ్చాత్తాపం నిండిన స్వరంతో అన్నాను.

''అబద్ధమా? ఏమిటది?''

''సుధీర్‌ని నేను ప్రేమించానని చెప్పిందంతా అబద్ధం! మీరు విరజని ప్రేమించారనే నిజాన్ని జీర్ణం చేసుకోలేక, స్త్రీ సహజమైన అసూయతో నేను ఒక వ్యక్తిని ప్రేమించానని చెప్తే మీరెలా రియాక్టవుతారో పరీక్షిద్దామని అలా చెప్పాను.''

''ఇంతకీ నీ పరీక్షలో నేను నెగ్గినట్టేనా?'' చిలిపిగా నవ్వేడతను. నేను అతని గుండెల్లో ముఖం దాచుకున్నాను. నా మనసు ఎంతో ప్రశాంతంగా వుంది.

★

